సాక్షి
వికారాబాద్
శనివారం । 23 । మార్చి । 2024



ఫుట్‌పాత్ ఆక్రమణలు

రెండేళ్ల క్రితం రహదారి విస్తరణ సమయంలో పాదచారులకు ఇబ్బంది కలుగొద్దని ఫుట్‌పాత్‌లు నిర్మించారు. 8లో▸



రక్తదాతలు.. ప్రాణదాతలు

వికారాబాద్ పోలీస్ సబ్‌డివిజన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
శనివారం సాయంత్రం 6:34	ఆదివారం ఉదయం 4:55

న్యూస్‌రీల్

ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలపై కొరడా



బాత్కులచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో నిర్మించిన అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు సర్వే నిర్వహించిన అధికారులు శుక్రవారం పోలీసుల సాయంతో అక్రమ నిర్మాణాలను, ప్రహరీలను నేలమట్టం చేశారు. ఇరిగేషన్ శాఖ ఏఈ రాజ్యలక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో కూల్చివేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎక్కడైనా చెరువులు, కుంటల కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని, కబ్జారాయుళ్లపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. త్వరలోనే ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు రక్షణ కోసం పూర్తి స్థాయిలోఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం బొంగ్లూర్‌లోని జిలాన్ ఖాన్ చెరువును పరిశీలించి ఎలాంటి ఆక్రమణలు లేవని తేల్చారు.

బాటసింగారం రెవెన్యూ పరిధిలో..

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రెవెన్యూ పరిధిలోని బాత్కుల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు జేసీబీలతో కూల్చివేయించారు. ఎన్నిసార్లు హెచ్చరికలు జారీ చేసినా అక్రమ నిర్మాణాలను నిలిపివేయకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చివేసినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



షాద్‌నగర్: షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో కలిసి ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఇటుక బట్టీలను తొలగించండి

ఆదిబట్ల కమిషనర్‌కు గ్రామస్తుల వినతి

ఇబ్రహీంపట్నం రూరల్: కాలుష్య కారకాలుగా మారిన ఇటుక బట్టీలను ఆదిబట్ల మున్సిపాలిటీ నుంచి తొలగించాలని ఎంపీపటేల్‌గూడ, సాహేబ్‌గూడ గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ పొట్టి అయిలయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇటుక బట్టీలతో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుందన్నారు. ప్రభుత్వం నుంచి తీసుకోవాల్సిన నిబంధనలు తుంగలో తొక్కి బట్టీలను నిర్వహించి వ్యాపారులు కోట్లకు పడగలెత్తారన్నారు. అలాగే విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో డ్రైనేజీ పనులు చేపట్టాలన్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, వెంకటయ్య, సత్తయ్య, శ్రీశైలం, రాజు, వెంకటేశ్, సత్తయ్య, లక్ష్మీపతి, కిరణ్, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నష్టం కలిగించొద్దు

అధికారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన

షాద్‌నగర్: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ప్రజల ఆస్తులకు నష్టం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. షాద్‌నగర్ పట్టణంలోని పాత జాతీయ రహదారి విస్తరణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నాణ్యతతో కూడిన నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. విస్తరణ పనుల్లో భాగంగా ప్రజల ఆస్తులకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు పక్కన ఉన్న భవన యజమానులు ఆందోళన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా విస్తరణ పనులు చేపట్టాలన్నారు. ఇందుకు ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా చర్చించి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందెమోహన్, ముబారక్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేక నీరసం

రైతును రాజు చేయడమే లక్ష్యం.. సాగునీటితో పొలాలను సస్యశ్యామలం చేస్తాం.. ప్రాజెక్టులు నిర్మించి లక్షల ఎకరాలను సాగులోకి తెస్తాం.. వేదికలెక్కిన ప్రతిసారీ నాయకులు చెప్పే మాటలు ఇవే.. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.. కొత్త ప్రాజెక్టుల మాట అటుంచితే.. పాత ప్రాజెక్టుల ఆధునికీకరణకు దశాబ్దాలుగా నిధులు మంజూరు కావడం లేదు. దీంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు నిదర్శనం కోట్‌పల్లి ప్రాజెక్టే..



దెబ్బతిన్న అలుగు

ఆధునికీకరణకు నోచుకోని కోట్‌పల్లి ప్రాజెక్టు

- శిథిలావస్థకు చేరిన కాలువలు
- మరమ్మతులకు నోచుకోని అలుగు, సీసీ బెడ్
- చివరి ఆయకట్టుకు అందని నీరు
- ఇబ్బందుల్లో అన్నదాతలు
- రూ. 140 కోట్లతో ప్రతిపాదనలు

ధారూరు: జిల్లాకే తలమానికమైన కోట్‌పల్లి ప్రాజెక్టు దశాబ్ద కాలంగా కళ తప్పింది. నిధులు లేక నీరసించిపోయింది. ఇదీ జిల్లాలోని ఏకైక మధ్య తరహా ప్రాజెక్టు పరిస్థితి. 2014 నుంచి ప్రాజెక్టు ఆధునికీకరణకు మోక్షం లభించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1967లో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 9,200 ఎకరాలకు సాగు నీరు అందేలా డిజైన్ చేశారు. 1,784 ఎకరాల విస్తీర్ణం, 1.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు ఎంతో ప్రాధాన్యత సంతరించుకొని పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతోంది. ధారూరు, పెద్దేముల్ మండలాల్లోని 18 గ్రామాల రైతులకు సాగునీరు అందుతోంది. దశాబ్దకాలంగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో చివరి ఆయకట్టు భూములకు నీరందడం లేదు. 2013లో అప్పటి మంత్రి, ప్రస్తుతం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ రూ. 100 కోట్ల జపాన్ దేశ జైకా నిధుల కోసం ప్రయత్నించారు. అయితే అప్పట్లో కాంగ్రెస్ అధికారం కోల్పోవడంతో ఫలితం లేకపోయింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టును పూర్తిగా విస్మరించారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టు కుడి కాలువ తూము ద్వారా 7,200 ఎకరాలకు, ఎడమ కాలువ, బేబి కెనాల్ ద్వారా 2 వేల ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంది. కాలువలు దెబ్బతినడం, బెడ్, అలుగు పాడవటంతో చివరి ఆయకట్టు భూములకు నీరందక పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. 2016లో అలుగు పారడంతో సీసీ బెడ్ చాలా చోట్ల దెబ్బతింది. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాల్సి ఉన్నా నామమాత్రపు పనులతో సరిపెట్టారు. రానున్న వర్షాకాలంలో అలుగు పారితే మరింత ప్రమాదం తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుడి, ఎడమ, బేబి కెనాల్ తోపాటు ఉప పంట కాలువలు శిథిలావస్థకు చేరాయి. కుడి కాలువ పొడవు 24 కిలో మీటర్లు, 32 డిస్ట్రిబ్యూషన్ కాలువలు ఉన్నాయి. ఇవి ముళ్లపొదలతో నిండిపోయాయి. ఎడమ, బేబీ కాలువల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

రైతన్నకు ప్రాజెక్టే ఆధారం

కోట్‌పల్లి ప్రాజెక్ట్‌పై రెండు మండలాల రైతుల ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రతి ఏటా యాసంగి, వానాకాలంలో వరి, వేరుశెనగ పంటలు సాగు చేస్తారు. ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీరు చేరితే ఏటా రెండుసార్లు పంటలు పండించవచ్చు. ధారూరు మండలం నాగసమందర్, అల్లాపూర్, రుద్రారం, గట్టెపల్లి, బూర్గుగడ్డ గ్రామాలకు, పెద్దేముల్ మండలంలోని కొన్ని గ్రామాలకు సాగునీరు అందుతోంది.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు

గత నెలలో కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొని ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ. 140 కోట్లు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆ నిధులు మంజూరైతే తమ కష్టాలు తీరుతాయని రైతులు అంటున్నారు.



పిచ్చిమొక్కలతో నిండిన కాలువను పరిశీలిస్తున్న అధికారులు



నాగసమందర్ సమీపంలో పాడైన డిస్ట్రిబ్యూషన్ చానల్

ప్రాజెక్టును బాగు చేయాలి



కోట్‌పల్లి ప్రాజెక్టును వెంటనే ఆధునికీకరించాలి. వర్షాలు పడకముందే అలుగు, సీసీ బెడ్‌కు మరమ్మతులు చేయించాలి. లేకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవ తీసుకొని నిధులు మంజూరయ్యేలా చూడాలి.

– మల్లికార్జున్, మాజీ వైస్ ఎంపీపీ



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం, మంత్రులు (ఫైల్)

అభివృద్ధికి ‘కోడ్’ అడ్డంకి

- ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల కారణంగా పనుల్లో జాప్యం
- ఇప్పటికే స్థలాల గుర్తింపు ప్రకియ పూర్తి

కొడంగల్: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు కోడ్ అడ్డుగా మారింది. ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల కారణంగా పనులు మూడు నెలలపాటు ఆలస్యం కానున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం సుమారు రూ.4,400 కోట్లు మంజూరు చేసింది. ఫిబ్రవరి 21న సీఎం తోపాటు ఆయా శాఖల మంత్రులు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అయితే ఎమ్మెల్సీ, సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉంది. కోడ్ ముగిసిన తర్వాతే పను లు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అవసరమైన స్థలాలను అధికారులు గుర్తించారు.అసైన్డ్, అటవీ, అన్యాక్రాంతమైన, సాగులో లేని భూములను తీసుకోవాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా పలు గ్రామాల్లో పట్టాదారుల నుంచి అంగీకార పత్రాలు సేకరిస్తున్నారు.

మంజూరైన పనుల వివరాలు

కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా మార్చి రూ.30 కోట్లు మంజూరు చేశారు. రూ.20 కోట్లతో భవన నిర్మాణం, రూ.10 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

- కోస్గికి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. భవన నిర్మాణం, మౌలిక సదుపాయాలకు రూ.11 కోట్లు మంజూరు చేశారు.
- దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండల కేంద్రాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరు చేశారు. ఒక్కో కళాశాల భవన నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు ఒక్కో మండలానికి రూ.7.13 కోట్ల చొప్పున మంజూరు చేశారు.
- కొడంగల్‌కు ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. భవన నిర్మాణాలు, సదుపాయాల కోసం రూ.124.50 కోట్లు మంజూరు చేశారు.
- కొడంగల్‌లో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు అనుమతులు ఇచ్చారు. భవనం, ఇతర అవసరాల కోసం రూ.46 కోట్లు విడుదల చేశారు.
- కొడంగల్‌కు ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాలను, పారామెడికల్ కళాశాలను మంజూరు చేశారు. దీని కోసం రూ.27 కోట్లు మంజూరు చేశారు.
- కొడంగల్ ప్రభుత్వాస్పత్రిని విస్తరించి 220 పడకల సామర్థ్యం కలిగిన టీచింగ్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. దీని కోసం రూ.27 కోట్లు కేటాయించారు.
- కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ.2,945 కోట్లు విడుదల చేశారు.
- సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ వెల్ఫేర్ గురుకులాలకు ఆధునాతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ శివారులో కొత్త భవనాలను నిర్మిస్తారు. మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల నూతన భవనానికి రూ.20 కోట్లు మంజూరు చేశారు.
- కొడంగల్‌లో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నిర్మాణానికి రూ.6 కోట్లు విడుదల చేశారు.
- నియోజకవర్గంలో రోడ్ల విస్తరణకు రూ.344 కోట్లు మంజూరు వచ్చాయి.
- పాఠశాల భవనాల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేశారు.
- కొడంగల్‌లోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.16 కోట్లు కేటాయించారు.



అనంతగిరి: మేరినాట్స్ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

ఎన్నికలకు ఏర్పాట్లు చేయండి

- అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ నియోజకవర్గానికి కేటాయించిన ఈవీఎంను భద్రపరిచేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. శుక్రవారం వికారాబాద్‌లోని మేరినాట్స్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో పిచ్చిమొక్కలను తొలగించాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలి

కుల్కచర్ల: మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కచ్చితంగా అమలు చేయాలని వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర ఆదేశించారు. శుక్రవారం కుల్కచర్లలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్నందున పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను ఎవరూ అతిక్రమించకుండా చూడాలని అన్నారు. సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, సీనియర్ అసిస్టెంట్ శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

ఆమనగల్లు: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పిలుపునిచ్చారు. మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మి గార్డెన్స్‌లో శుక్రవారం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆచారితో పాటు నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, పార్టీ ఎంపీ అభ్యర్థి భరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నరేంద్రమోదీ అనేక పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. వాటి గురించి ఇంటింటికీ వెళ్లి వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ప్రపంచంలో భారతదేశ ప్రతిష్టను పెంచారని, ప్రజలంతా ఆయనకు అండగా ఉండాలని కోరారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి భరత్ మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ నుంచి విజయం సాధించి ప్రధాని మోదీకి కానుకగా అందించాలని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండె హరిప్రసాద్, దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు కాసుల వెంకటేశ్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆచారి

పార్టీ మారే ప్రసక్తే లేదు

- వదంతులు నమ్మొద్దు
- ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సోషల్ మీడియాలో తనపై వచ్చిన వార్తలను ఎమ్మెల్యే కాలె యాదయ్య ఖండించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కొంత మంది కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఎట్టి పరిస్థితిల్లో పార్టీ మారే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని పేర్కొన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కొంత మంది తాను బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్‌లోకి వస్తున్నానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు గెలిపించిన పార్టీలోనే ఉండి వారి కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం పోరాడుతానని స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసానిజ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఈ ప్రాంత అభివృద్ధికి కాసాని జ్ఞానేశ్వర్ అధిక నిధులు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తిని ఎంపీగా గెలిస్తే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. బీసీ బిడ్డను గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ధరణి.. పరేషానీ !

- సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం
- పోర్టల్‌లో 39 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్
- వరుస ఎన్నికలు, కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్ల బదిలీలతో ఆలస్యం
- ఫైళ్ల క్లియరెన్స్‌లో మందగించిన వేగం
- స్పెషల్ డ్రైవ్‌లోనూ ఫలితం శూన్యం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి పోర్టల్‌కు వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో ఒకప్పుడు తెలంగాణలోనే నంబర్–1 స్థానంలో ఉన్న జిల్లా ప్రస్తుతం ఆ గుర్తింపును కోల్పోయిందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. వరుస ఎన్నికలకు తోడు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్ల బదిలీలతో దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. కలెక్టర్లు మారిన ప్రతీసారి క్షేత్రస్థాయి నివేదికల రూపకల్పనలో మార్పులు చేర్పులు తీసుకొస్తుండటం కూడా కారణమవుతోంది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ధరణి పోర్టల్‌లో దరఖాస్తులు పేరుకుపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 1 నుంచి 9 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని భావించారు. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న కంపెనీ సహా సీసీఎల్‌ఏ నుంచి సరైన సహకారం లేకపోవడంతో తహసీల్దార్లు కూడా ఏమీ చేయలేక చేతులెత్తేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వం ఈ డ్రైవ్‌ను 11 నుంచి 17వ తేదీ వరకు పొడిగించినా ఆశించిన స్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదు. ఫలితంగా బాధితులకు మళ్లీ నిరాశే మిగిలింది.



వరుస బదిలీల ప్రభావం

2021–22లో ధరణి పోర్టల్ ర్యాంకింగ్‌లో జిల్లా తెలంగాణలోనే ప్రథమస్థానంలో నిలిచింది. ధరణి సమస్యల పరిష్కారంలో ఉత్తమ గుర్తింపు కూడా పొందింది. అప్పటి వరకు కలెక్టర్‌గా పని చేసిన అమయ్‌కుమార్ 2023 ఫిబ్రవరిలో మేడ్చల్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొత్తగా హరీశ్ రాగా అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత కేంద్ర ఎన్నికల కమిషన్ ఆయనపై వేటు వేసింది. అనంతరం భారతి హోళికేరి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది రోజులకే ఆమె ను కూడా తప్పించి, మేడ్చల్ కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న గౌతం పోట్రుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత జనవరి 3న శశాంకను కలెక్టర్‌గా నియమించారు. కేవలం 11 నెలల్లో నలుగురు కలెక్టర్లు మారారు. కలెక్టర్ మారిన ప్రతీసారి నివేదికల జాబితా తీరు మారుతూ వస్తోంది. ఒకరు ఆన్‌లైన్‌లో పంపమంటే.. మరొకరు ఆఫ్‌లైన్‌లో పంపాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమయంలో తహసీల్దార్లు, ఆర్డీఓలకు స్థానచలనం కల్పించడం.. అప్పటికే క్షేత్రస్థాయి అధికారులపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత బాధ్యతలు స్వీకరించిన వారు ఈ ఫైళ్లను ముట్టుకునేందుకు వెనుకాడారు. ఫలితంగా ధరణి సమస్యల పరిష్కారంలో ఒకప్పుడు రాష్ట్రంలోనే నంబర్ 1 స్థానంలో ఉన్న జిల్లా ప్రస్తుతం ఆ ర్యాంక్‌ను కోల్పోవాల్సి వచ్చింది.

బాధితుల ఎదురుచూపులు

ప్రస్తుతం ధరణి పోర్టల్‌లో మొత్తం 2,46,536 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో మన జిల్లా నుంచే అత్యధికంగా 39,076 ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఇతర జిల్లాల్లో దరఖాస్తులను దాదాపు క్లియర్ చేశారు. కానీ మన జిల్లాలో మాత్రం ఏడు వేలకు మించి పరిష్కరించలేకపోయినట్లు తెలిసింది. వీటిలో మెజార్టీ దరఖాస్తులు వివాదాస్పద భూములకు సంబంధించినవే ఉన్నాయి. విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, మిస్సింగ్ సర్వే నంబర్లు, నిషేధిత జాబితాకు సంబంధించిన దరఖాస్తులే అధికం. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా షాబాద్ మండలంలో 1,580 దరఖాస్తులకు 580, శంకర్‌పల్లిలో 3 వేలకు 300, యాచారంలో 2,550కు 700, కందుకూరులో 2,531కు 400, మంచాలలో 2,291కు 250, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 2,111కు 274, మొయినాబాద్‌లో 2,246కు 571 దరఖాస్తులకు మాత్రమే నివేదికలు సిద్ధం చేసినట్లు తెలిసింది. మిగిలిన దరఖాస్తులు పరి ష్కారానికి నోచుకుంటాయో లేదో కూడా చెప్పలేని పరిస్థితి. మెజార్టీ దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో పడిపోవడంతో బాధితులకు ఎదురుచూపులు తప్పడం లేదు.అత్యవసర పరిస్థితుల్లో భూములు అమ్ముకోలేక వారంతా ఇబ్బంది పడుతున్నారు.

క్లుప్తంగా

నేడు ఆలయ భూముల కౌలుకు వేలం

కొడంగల్‌ రూరల్‌: పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీ జగద్గురు నిరంజన మఠం భూములను శనివారం బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎండోమెంట్‌ మేనేజర్‌ బాల్‌రాజ్‌ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి సర్వేనంబర్‌ 262లోని 16 ఎకరాల భూమికి, నిరంజన మఠానికి సంబంధించి కుదురుమళ్ల, కొండారెడ్డిపల్లి, చిట్లపల్లి, కొడంగల్‌లో ఉన్న భూములను కౌలుకు వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తగిన డిపాజిట్‌ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. వేంకటేశ్వర ఆలయంలో ఉదయం 10గంటలకు వేంకటేశ్వరస్వామి ఆలయంలో, ఉదయం 11 గంటలకు మఠం ఆవరణలో వేలం ఉంటుందన్నారు.

చిరు ధాన్యాల్లో బలవర్ధక ఆహారం

జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి జ్యోతి పద్మ



మాట్లాడుతున్న జ్యోతిపద్మ

మోమిన్‌పేట: చిరు ధాన్యాలతో పిల్లల ఎదుగుదల, రోగ నిరోధక శక్తి బలంగా ఉంటుందని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి జ్యోతి పద్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి పద్మ మాట్లాడుతూ.. పిల్లలకు చిరుధాన్యాలతో సంపూర్ణ పౌష్టికాహారం అందుతుదన్నారు. పోషణలో రాజీపడకుండా అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రతీ రోజు ఉడికించిన గుడ్డు ఇవ్వాలన్నారు. పుట్టిన వెంటనే చిన్నారికి ముర్రుపాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కాంతారావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి, వైద్యాధికారి సుజల, సూపర్‌వైజర్‌ ధనలక్ష్మి, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌ కేంద్రం పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న వెంకట్‌రెడ్డి

కొడంగల్‌: ఈనెల 28న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రంలో మహబూబ్‌నగర్‌ స్థానిక సంస్థల ఎన్నికలకు మండల పరిధిలోని జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు ఓటేయాల్సి ఉంటుంది. ఎమ్మెల్సీ ఎన్నికను పారదర్శకంగా నిర్వహించాలని కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ విజయకుమార్‌, ఎంపీడీఓ ఉష శ్రీ తదితరలు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ ఆక్రమణలు



కొడంగల్‌ చౌరస్తాలో ఫుట్‌పాత్‌పై ఓ దుకాణాదారు ఏర్పాటు చేసిన సామగ్రి

పట్టించుకోని మున్సిపల్‌ అధికారులు
- ఇబ్బంది పడుతున్న పాదచారులు
- ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

పరిగి: రెండేళ్ల క్రితం రహదారి విస్తరణ సమయంలో పాదచారులకు ఇబ్బంది కలుగొద్దని ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ఇది ఏర్పాటు చేసింది మొదలు పక్కనే ఉన్న షాప్‌ యజమానులు ఫుట్‌పాత్‌లపై తమ వ్యాపార సామగ్రి ఉంచి అమ్మకాలు సాగిస్తున్నారు. పలువురు ఏకగా గోడలే నిర్మించారు. ఇదే విషయంపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు మున్సిపల్‌ అధికారులు ఆదేశించిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పట్టణంలో ఫుట్‌పాత్‌ వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థి సంఘాల నాయకులు మున్సిపల్‌ అధికారులకు విన్నవించారు. మున్సిపల్‌ అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇస్తే సరే..

ఫుట్‌ పాత్‌పై వ్యాపారం చేసేందుకు మున్సిపల్‌ అధికారులకు ప్రతీ నెల మామూళ్లు ఇవ్వాల్సిందే చిన్నపాటి నిర్మాణాలు చేపట్టాలన్న రూ.వేయి నుంచి రూ.లక్షల్లో లంచాలిస్తున్నట్లు ఆరోపనాలు వినిపిస్తున్నాయి. మున్సిపల్‌లో పనిచేసే క్రిందిస్థాయి సిబ్బంది ఓ వ్యక్తి ప్రతీ నెల ఒక్కో దుకాణం నుంచి స్థాయికి తగ్గట్టు రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా నెలకు రూ.2లక్షలకు పైగా మామూళ్లు వసూలు అవుతున్నాయి.

పాదచారులు నడిచేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు వ్యాపారస్తులు సామగ్రి ఏర్పాటుకు ఏర్పాటు చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రతీ నెల వ్యాపారస్తులు అందించే తాయిలాలకు అలవాటు పడిన వారు చర్యలకు వెనుకాడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారే లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం విద్యార్థులతో రద్దీగా ఉంటే ఈ ప్రాంతంలో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందనని ఆందోళన చెందుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన వ్యాపారస్తులపై వెంటనే చర్యలు తీసుకుంటాం. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను అక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. ఫుట్‌పాత్‌ వ్యాపారం పూర్తిగా తొలగించాలి.

– వెంకటయ్య, మున్సిపల్‌ కమిషనర్‌, పరిగి.

ఇంటర్‌ స్టేట్‌ బార్డర్‌ క్రైం మీటింగ్‌

కొడంగల్‌: కొడంగల్‌, తాండూరు సర్కిల్‌ పోలీసు అధికారులు శుక్రవారం కర్నాటక పోలీస్‌ అధికారులతో నిర్వహించిన ఇంటర్‌ స్టేట్‌ బార్డర్‌ క్రైం మీటింగ్‌లో పాల్గొన్నారు. కర్నాటక రాష్ట్రం చించోలి సబ్‌ డివిజన్‌ అధికారులతో చించోలికి అనుసంధానంగా ఉన్న తెలంగాణ పోలీస్‌ అధికారులతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. దొంగతనాలు, డకాయిడ్స్‌, తప్పిపోయిన, గుర్తించబడని మర్డర్ల గురించి, గంజాయి నేరస్తుల ప్రవర్తన పై రెండు ప్రాంతాల్లో జరిగే నేరాలపై నియంత్రన గురించి చర్చించారు. సమావేశంలో కర్నాటక రాష్ట్రం చించోలీ పోలీస్‌ అధికారులతో పాటు తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, కొడంగల్‌ సీఐ శ్రీధర్‌రెడ్డి, తాండూరు రూరల్‌ సీఐ అశోక్‌గౌడ్‌ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ పోలీసులు

ఉల్లి క్వింటాల్‌@రూ.1,600

పెద్దేముల్‌: మార్కెట్లో ఉల్లి ధర పెరుగుతోంది. ఇరవై రోజుల క్రితం క్వింటాల్‌ ఉల్లి గడ్డ రూ.800 నుంచి రూ.వేయి వరకు ఉంది. గత మూడు రోజులుగ మార్కెట్లో రూ.1,600 వందలకు పలుకుతోందని మండలంలోని ఇందూరు, గిర్మాపూర్‌, నాగులపల్లి, బుద్దారం, గాజీపూర్‌ తదితర గ్రామాల రైతులు అంటున్నారు. మార్కెట్‌ కోసం హైదరాబాద్‌ లేదా మహబూబ్‌నగర్‌కు వెళ్లాల్సి వస్తోందని స్థానికంగా మార్కెట్‌ ఏర్పాటు చేస్తే రవాణాభారం తగ్గుతుందని కోరుతున్నారు. రూ.3వేల వరకు ధర వస్తే కష్టానికి లాభం ఉంటుందని రైతులు వాపోతున్నారు.

నీటి పొదుపుపై అవగాహన కల్పించండి

డాక్టర్‌ మాధురి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న మాధురి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ నీటి పొదుపును పాటించేలా ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు మాధురి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటిని వృథాచేయకుండా పొదుపు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జనాభా పెరుగుతున్న నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వరూపారాణి, విజయలక్ష్మి, యాదమ్మ, జంగమ్మ, సునీత, లావణ్య, స్వరూప, విజయలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ క్లినిక్‌ సీజ్‌

అనుమతి లేని చికిత్సలు చేయొద్దని వైద్యాధికారుల హెచ్చరిక



యాసిన్‌ ఫస్ట్‌ ఎయిడ్‌ సెంటర్‌ను సీజ్‌ చేస్తున్న వైద్యాధికారులు

పరిగి: అనుమతి లేని చికిత్స చేసి.. ఓ వ్యక్తి మృతికి కారణమైన యాసిన్‌ ఫస్ట్‌ ఎయిడ్‌ సెంటర్‌ను వైద్యారోగ్య శాఖ అధికారులు సీజ్‌ చేశారు. శుక్రవారం పట్టణంలోని క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీ వైద్యుడు గఫార్‌కు క్లినిక్‌ నిర్వహణ, అలోపతి వైద్యం చేసేందుకు అనుమతి లేనందున క్లినిక్‌ను సీజ్‌ చేశామని.. ఇక మీదట రోగులకు చికిత్సలు చేయొద్దని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవ్‌రాజ్‌ మాట్లాడుతూ.. ప్రథమ చికిత్స కేంద్రాల్లో ఫస్ట్‌ ఎయిడ్‌ మాత్రమే చేయాలని.. వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సీజ్‌ చేసిన క్లినిక్‌ను తెరిచే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు హెచ్చరించారు.

ముందు సీజ్‌.. వెనక ఓపెన్‌!

యాసిన్‌ ఫస్ట్‌ ఎయిడ్‌ సెంటర్‌ను సీజ్‌ చేసిన అధికారులు పట్టణం కూడా దాటక ముందే.. ఆర్‌ఎంపీ వైద్యుడు గఫార్‌ భవనం వెనక నుంచి రోగులకు చికిత్సలు మొదలు పెట్టాడు. ఇది చూసిన వారు ముక్కున వేలేసుకున్నారు. తెలిసీ తెలియని వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తున్నారు.



సీజ్‌ చేసిన అనంతరం చికిత్స నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ డాక్టర్‌ గఫార్‌

జీవనోపాధిని పెంపొందించుకోవాలి

డీఆర్‌డీఓ శ్రీనివాస్‌



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్‌

మర్పల్లి: మహిళలు జీవనోపాధులను పెంపొందించుకుని లాభాలు గడించాలని డీఆర్‌డీఓ శ్రీనివాస్‌ అన్నారు. మండల పరిధిలోని స్త్రీ శక్తి భవన్‌లో శుక్రవారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం కళాశాల, పాఠశాల విద్యార్థులకు యూనిఫాం కుట్టించుట కొరకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఆర్‌డీఓ మాట్లాడుతూ.. మహిళ సంఘాల సభ్యులు తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో చిన్న వ్యాపారాలు చేయాలని, కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనోపాధులను పెంపొందించుకుని లాభాలు గడించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజమల్లయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు జగదాంబ, ఏపీఎం మధూకర్‌, మాజీ అధ్యక్షురాలు ఇందిరా, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి



ఆశమ్మ మృతదేహం

దౌల్తాబాద్‌: అనుమానాస్పదంగా మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తిమ్మాయిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్‌ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల ఆశమ్మ(50) భర్త చనిపోవడంతో ఎనిమిదేళ్లుగా తల్లిగారింటి వద్దే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. గురువారం ఇంట్లో తల్లి, సోదరుడితో గొడవపడిన ఆశమ్మ ఇంటి నుంచి వెళ్లిపోయింది. శుక్రవారం దౌల్తాబాద్‌ చెరువులో మహిళ మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఆశమ్మగా గుర్తించి.. పోస్టుమార్టం నిమిత్తం కొడంగల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల సహకారం మరువలేనిది

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న డీసీసీబీ అధికారులు, ప్రజా ప్రతినిధులు

తాండూరు: డీసీసీబీ అధికారుల సహకారం మరువలేనిదని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని రాజేంద్రనగర్‌లో డీసీసీబీ పాలక వర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగిన బుయ్యని మనోహర్‌రెడ్డిని ఆహ్వానించి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను డీసీసీబీ చైర్మన్‌గా రైతుల సంక్షేమం కోసమే పని చేశానన్నారు. అందుకు డీసీసీబీ అధికారులు, పాలక వర్గ సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ అధికారులు, డైరెక్టర్‌లు, పీఏసీఎస్‌ చైర్మన్‌లు తదితరులున్నారు.

రక్తదాతలు.. ప్రాణదాతలు

ఏఎస్పీ రవీందర్‌రెడ్డి



రక్తదానం చేస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి
చిత్రంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐలు

అనంతగిరి: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా అడిషనల్‌ ఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్‌ పోలీస్‌ సబ్‌ డివిజన్‌ ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని అంబేద్కర్‌ భవన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో విద్యార్థులు, యువకుల పాల్గొని 158 యూనిట్ల రక్తాన్ని మెడికల్‌ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. రక్తదానంపై ఉన్న అపోహలు వీడాలన్నారు. ఈ శిబిరంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ సీఐ నాగరాజు, ధారూర్‌ సీఐ రామకృష్ణ, మోమిన్‌పేట సీఐ ఆంజనేయులు సబ్‌ డివిజన్‌లోని ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

పూలు విక్రయించే రైతుపై దాడి



గాయపడిన రైతు మాదప్ప

తాండూరు టౌన్‌: పూలమ్ముకుని జీవనం సాగిస్తున్న ఓ రైతుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన శుక్రవారం తాండూరు పోలీసు స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. బాధిత రైతు, స్థానికులు తెలిపిన ప్రకారం.. పెద్దేముల్‌ మండలం జనగాం గ్రామానికి చెందిన రైతు మాదప్ప నిత్యం పట్టణంలోని భద్రేశ్వర్‌ చౌక్‌లో పూలను విక్రయిస్తుండేవాడు. అయితే కొందరు వ్యక్తులు శుక్రవారం అతని వద్దకు వచ్చి తమ సేటు రమ్మంటున్నాడని పిలిచారు. అతను నిరాకరించడంతో వెంటనే ఇక్కడ పూలు అమ్మొద్దు అంటూ మూకుమ్మడిగా దాడి చేశారు. స్థానికులు వారిని నిలువరించారు. గాయపడిన రైతు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలో ఓ వర్గానికి చెందిన వ్యాపారస్తులు సమీప గ్రామాల నుంచి వచ్చి పూలు, కూరగాయలు విక్రయించే రైతులను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికే పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డారని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌ రజినీకాంత్‌, పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం, ప్రధాన కార్యదర్శి కిరణ్‌ ముదిరాజ్‌ ఆరోపించారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీఐ సంతోశ్‌కుమార్‌ను కోరారు.

మట్టి టిప్పర్ల సీజ్‌

తలకొండపల్లి: అనుమతి లేకుండా చెరువు మట్టిని తరలిస్తుండగా పోలీసులు రెండు టిప్పర్లను పట్టుకొని సీజ్‌ చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్‌ తెలిపిన ప్రకారం.. శుక్రవారం అనుమతి లేకుండా మండల పరిధిలోని అంతారం చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు డ్రైవర్లతో పాటు, యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

వివాదాస్పద భూమిపై విచారణ

నివేదిక సిద్ధం చేసిన ఆర్డీఓ వాసుచంద్ర



తిమ్మాయపల్లిలో భూ వివాదంపై విచారణ చేపడుతున్న ఆర్డీఓ వాసుచంద్ర

దోమ: మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలోని భూవివాదంపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌ నారాయణరెడ్డి సంబంధింత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీఓ వాసుచంద్ర గ్రామంలోని సర్వే నంబర్‌ 50, 43 భూములను పరిశీలించారు. గ్రామానికి చెందిన చీమె రాములమ్మలకు సర్వేనంబర్‌ 50లో 1.09 ఎకరాలు, సర్వే నంబర్‌ 43లో 1.20 ఎకరాలు ఆమె పూర్వీకుల నుంచి వచ్చింది. 2018లో సర్వే నంబర్‌ 50లోని 1.09 ఎకరాల భూమిని రియల్టర్‌ ఆయుబ్‌కు విక్రయించింది. ఈ భూమి విషయంలో ఇద్దరు ఘర్షణ పడుతూ కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు ఆర్డీఓ సంబంధిత పత్రాలను పరిశీలించి సర్వేయర్‌తో భూమి సర్వే చేయించి కొనుగోలు చేసిన భూమిని గుర్తించారు. పంచనామ అనంతరం ఇరువర్గాల సంతకాలు సేకరించి కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ పురుషోత్తం, ఆర్‌ఐ సుదర్శన్‌, ఇరువర్గాల సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నీళ్లు తెచ్చేందుకు వెళ్లి..

- ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం
- ఓ విద్యార్థి మృతి, మరో విద్యార్థికి గాయాలు
- మైనర్‌కు బైక్‌ ఇచ్చిన ఉపాధ్యాయుడు, ఆర్టీసీ బస్‌ డ్రైవర్‌పై కేసు



కార్తీక్‌ (ఫైల్‌)



ప్రమాద స్థలిలో బస్‌, బైక్‌

నవాబుపేట: పాఠశాల ఉపాధ్యాయులకు మినరల్‌ వాటర్‌ తెచ్చేందుకు వెళ్లిన ఓ విద్యార్థి మృతి చెందగా.. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అర్కతలకు చెందిన కొత్తగడి వెంకటయ్య కుమారుడు కార్తీక్‌(14) నవాబుపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ప్రార్థన అనంతరం కార్తీక్‌, వడ్డె వేణుకు ఉపాధ్యాయుడు బుచ్చిరెడ్డి బైక్‌ ఇచ్చి వాటర్‌ ప్లాంట్‌లో తాగునీరు తీసుకురమ్మని పంపాడు. ప్లాంట్‌ వద్ద క్యాన్‌ను ఉంచి పులుమామిడి(ఆదర్శ పాఠశాల) రోడ్డు వైపు వెళ్లారు. ఆ సమయంలో పులుమామిడి నుంచి నవాబుపేట్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కార్తీక్‌ తలకు బలమైన గాయాలై స్పృహ కోల్పోగా.. వేణు గాయపడ్డారు. గమనించిన వారు పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వడంతో వారు కారులో వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స తర్వాత కార్తీక్‌ను మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఉపాధ్యాయుడు బుచ్చిరెడ్డి, బస్‌ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భరత్‌ భూషన్‌ తెలిపారు.

‘ఉపాధి’ బకాయిలను చెల్లించండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటయ్య



కూలీలతో మాట్లాడుతున్న వెంకటయ్య

దోమ: ఉపాధిహామీ కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.వెంకటయ్య డిమాండ్‌ చేశారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని దిర్సంపల్లిలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ కూలీలకు కొలతల పేరుతో కూలీ రేట్లను తగ్గించి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఆరు వారాలుగా చేసిన పనులకు సంబంధించిన బిల్లులు కూలీలకు రాలేదని మండిపడ్డారు. ప్రతీ కూలీకి 200 రోజుల పని దినాలు కల్పిస్తూ.. రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్‌ చేశారు. ప్రమాద బీమా రూ.10లక్షలు చెల్లించాలని అన్నారు. పని ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాలని కోరారు. కూలీలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌ ఏరియాలో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్‌..



మిర్జాపూర్‌ శివారులో తనిఖీలు చేస్తున్న మైనింగ్‌ ఏడీ సత్యనారాయణ

వికారాబాద్‌: మైనింగ్‌ మాయ శీర్షికన శుక్రవారం ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన వార్తకు కలెక్టర్‌ స్పందించారు. మిర్జాపూర్‌ శివారులోని మైనింగ్‌ ఏరియాను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఏడీ సత్యనారాయణను ఆదేశించారు. దీంతో ఆయన మైనింగ్‌ జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. లీజు పొందిన వారు ఈ ఏడాదిలో మరో 10 వేల టన్నులు తవ్వుకునేందుకు అనుమతి ఉందని తెలిపారు. అయితే మన పరిధిలో అనుమతులు ఉన్నంత వరకే తవ్వారా..? ఎక్కువ తవ్వారా అనే విషయం ఫుట్‌ మెజర్‌మెంట్‌ సర్వే చేస్తేనే తెలుస్తుందన్నారు.

ప్రేమను గెలిచినా.. విధి ఓడించింది

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కందుకూరు: ప్రేమ పెళ్లికి కుటుంబసభ్యులు పచ్చజెండా ఊపారు. కొన్ని రోజుల్లోనే ఇరువురూ వైవాహిక జీవితంతో ఒకటి కానున్నారు. అంతలోనే విధి వక్రీకరించింది. రోడ్డు ప్రమాదం ఆ యువకుడిని బలిగొంది. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్‌ జిల్లా గుంతకోడూరుకు చెందిన తూంకుంట రాములు పెద్ద కుమారుడు తూంకుంట శేఖర్‌(27) హైదరాబాద్‌ సంతోషనగర్‌లో నివసిస్తూ ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన ప్రేమించిన అమ్మాయితో వివాహం చేస్తామని తండ్రి గ్రామానికి రమ్మని పిలిచారు. దీంతో ఆయన సంతోషించి ప్రేమించిన అమ్మాయితో పాటు బంధువైన మరో మహిళను ఈ నెల 19న సంతోష్‌నగర్‌లో బస్సు ఎక్కించారు. సదరు అమ్మాయికి చెందిన ద్విచక్రవాహనంపై ఆయన స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో మండల పరిధిలోని దెబ్బడగూడ గేట్‌ వద్ద శ్రీశైలం రహదారిపై అతివేగంగా వచ్చిన కారు ఆయన బైక్‌ను ఢీకొట్టింది. దీంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతున్న యువకుడు గురువారం రాత్రి మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రావణ్‌ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.